సాక్షి
మెదక్
బుధవారం । 24 । సెప్టెంబర్ । 2025


చేగుంట మండలం కర్నాల్‌పల్లి గ్రామ చావిడి వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు

న్యూస్‌రీల్

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


బతుకమ్మ సంబురాలు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

టేక్మాల్(మెదక్): గర్భిణులు, బాలింతలు పోషకారం తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని సీడీపీఓ పద్మలత అన్నారు. మండలంలోని బొడ్మట్‌పల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ మాసం సంబురాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులకు అందిస్తున్న పోషక పదార్థాలను ప్రదర్శించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మునగాకులో విటమిన్లు, ఖనిజాలు యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయని, అవి రోగనిరోధక శక్తిని పెంచుతాయన్నారు. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించి, 340 రకాల ఆరోగ్య సమస్యలకు పరిష్కారం ఉంటుందని చెప్పారు. అనంతరం బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. సూపర్‌వైజర్ కలాలి కృష్ణవేణి, అంగన్‌వాడీ టీచర్లు దీపిక, లక్ష్మి, ఏఎన్‌ఎం జయప్రద, సావిత్రి, అంగన్‌వాడీ హెల్పర్లు గడ్డం అమల, దుర్గరాణి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు కీలకం

వ్యవసాయ ఏడీఏ రాజ్‌నారాయణ


వెంకటాపూర్‌లో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

రామాయంపేట(మెదక్): వరి సాగులో వివిధ దశల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ, సమగ్ర పోషక యజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని వ్యవసాయ సహాయ సంచాలకులు రాజ్‌నారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఆర్ వెంకటాపూర్‌లో పలు వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి మాట్లాడారు. ప్రతి గ్రామానికి చెందిన ఇద్దరు రైతులకు ఎంటీయు 1010 రకం వరి విత్తనాలను అందజేశామన్నారు. వారు పండించిన ఉత్పత్తులను ఇతర రైతులకు అందజేస్తామని తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త నిర్మల మాట్లాడుతూ.. చిరు పొట్ట దశలో చీడపీడలు సోకకుండా పంటలకు వాడాల్సిన మందులను పిచికారీ చేయాలని సూచించారు. పంటచేలకు మోతాదుకు మించి యూరియా వాడితే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): వరి, పత్తి పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, తెగుళ్లను నివారించాలని తునికి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని రాయిలాపూర్‌లో వరి, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో కాండంతొలుచు, కంకినల్లి పురుగుల ఉధృతిని గమనించామన్నారు. కాండంతొలుచు పురుగు నివారణకు ఐసోసైక్లోసిరమ్120మి.లీ, లేదా క్లోరానిట్రిలిప్రోల్ 60మి.లీ, ఎకరాకు పిచికారీ చేయాలని తెలిపారు. కంకినల్లి నివారణకు స్పైరోమెసిఫెన్ 200మి.లీ, ప్రోజికొనజోల్ 200మి.లీ, ఎకరాకు పిచికారీ చేయాలని సూచించారు. రైతులు రోజు పంటను పరిశీలించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చెప్పారు.

బ్యాంకు ఖాతాలివ్వండి

తూప్రాన్: రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్‌ఆర్) కోసం భూములు కోల్పోతున్న రైతులు పరిహారం కోసం వెంటనే బ్యాంకు అకౌంట్లను అందజేయాలని ఆర్డీఓ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తన కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రిపుల్‌ఆర్ కోసం భూసేకరణ పరిహారం చెల్లింపు ప్రక్రియను వేగవంతం చేశామని, భూములు కోల్పోయిన రైతులకు న్యాయమైన పరిహారం అందిస్తామన్నారు. ఇప్పటి వరకు 630 మంది రైతులకు గాను 505 మాత్రమే బ్యాంకు అకౌంట్లు అందజేశారని తెలిపారు.

ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన

మెదక్ కలెక్టరేట్: ముస్లిం మైనార్టీల్లో ఆర్థికంగా వెనకబడిన వర్గాల బలోపేతానికి ప్రభుత్వం ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన పథకం తెచ్చినట్లు జిల్లా ఇన్‌చార్జి మైనార్టీ వెల్ఫేర్ అధికారి విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం మహిళలకు రూ.50 వేల వరకు రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు 21 నుంచి 55 యేళ్ల మధ్య వయస్సు కలిగిన ఫకీర్, దూదెకుల, దుర్బాల వర్గానికి చెంది ఉండాలన్నారు. ఐదేళ్లలో ప్రభుత్వం నుండి ఎలాంటి లబ్ధి పొందలేదని డిక్లరేషన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హత గల మహిళలు అక్టోబర్ 6వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 8142741976 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

శ్రీ గాయత్రీదేవిగా.. వన దుర్గమ్మ

దసరా శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా ఏడుపాయల వన దుర్గమ్మ మంగళవారం శ్రీ గాయత్రీ దేవి అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. గోకుల్ షెడ్డులో కొలువు దీరిన దుర్గమ్మ తల్లిని తెల్లవారు జామున వేద బ్రాహ్మణులు గులాబీ రంగు వస్త్రాలతో అలంకరించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వనదుర్గా అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కాగా, మూడో రోజైన బుధవారం అమ్మవారు అన్నపూర్ణా దేవి అలంకారంతో దర్శనమిస్తారు. – పాపన్నపేట(మెదక్)


శ్రీ గాయత్రీ దేవి అలంకారంతో వన దుర్గమ్మ

బతుకమ్మ సంబురం

చేగుంటలో మంగళవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా జరుపుకొన్నారు. రకరకాల పూలతో బతుకమ్మలను పేర్చారు. అనంతరం మహిళలు ఉత్సాహంగా ఆడి పాడారు. – చేగుంట(తూప్రాన్)

ఆశ పెట్టారు.. ఆగం చేశారు..!

రాజీవ్ యువ వికాసంపై నిరుద్యోగుల ఆవేదన

- నెలాఖరులోగా 'స్థానిక' నోటిఫికేషన్
- మరింత వాయిదా పడే అవకాశం
- ఆందోళనలో లబ్ధిదారులు

జిల్లాలో యూనిట్ల వివరాలు
మొత్తం యూనిట్లు 10,687
లింకేజీ లేకుండా 3,498 యూనిట్లు
రూ.లక్షలోపు రుణాలు 2,632 యూనిట్లు
రూ. 2లక్షల వరకు 2261 యూనిట్లు
రూ.4 లక్షల వరకు 2,205 యూనిట్లు
మైనర్ ఇరిగేషన్‌కు అదనంగా మరో 51 యూనిట్లు
దరఖాస్తులు : 32,638

మెదక్ కలెక్టరేట్: రాజీవ్ యువ వికాసం పథకం సరిగా అమలు కావడం లేదు. ఆశావహులు దరఖాస్తులు చేసుకొని నెలలు గడుస్తున్నా.. పురోగతి కనిపిండం లేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడిస్తాం... అప్పుడిస్తామంటూ ఆశ పెట్టి తమను ఆగం చేశారని లబ్ధిదారులు వాపోతున్నారు. డబ్బులొస్తే ఉన్న ఉపాధి అవకాశాలు మెరుగు పరుచుకుందామమన్న ఆశలు అడియాశలయ్యాయి. పైగా నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందని ప్రచారం నేపథ్యంలో లబ్ధిదారుల్లో మరింత గుబులు రేకెత్తిస్తోంది. అప్పటిలోగా రుణాలిస్తారా? లేక ఆశ చూపి ఆగం చేస్తారోనన్న వారిని పట్టి పీడిస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా రుణాలిచ్చి స్వయం ఉపాధికి మార్గం చూపాలని మెదక్ పట్టణంలోని గోల్కొండ వీధికి చెందిన నిరుద్యోగ యువకుడు దానోల్ల క్రాంతి ఆవేదన వ్యక్తం చేశాడు.

ఎన్నో ఆశలతో..

ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని మే నెలలో ప్రారంభించి 18 నుంచి 55 యేళ్లలోపు నిరుద్యోగులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటన చేసింది. దీంతో జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులంతా ఉద్యోగం లేనందున ప్రభుత్వం స్వయం ఉపాధికి దారి చూపుతుందని ఎంతో ఆశ పడ్డారు. దీంతో నిరుద్యోగులంతా పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. అర్హత ఆధారంగా రూ.50 నుంచి రూ.4లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకొచ్చింది.

జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ, ఓబీసీలు కలిపి మొత్తం 32,638 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో ఎస్సీలు 6,711, ఎస్టీలు 3,461, బీసీలు 19,686, ఈబీసీలు 550, మైనార్టీలు 2,175, క్రిస్టియన్లు 55 దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. వీటిని పూర్తి స్థాయిలో పరిశీలన చేసిన అధికారులు 29,855 దరఖాస్తులను బ్యాంకులకు పంపించారు. సరైన ధ్రువ పత్రాలు లేకపోవడంతో వాటిని తొలగించినట్లు సమాచారం. ముందుగా రూ.50వేల వరకు రుణాలు ఇస్తామని తెలిపి తేదీని ప్రకటించిన ప్రభుత్వం చివరకు వాయిదా వేయడంతో లబ్ధిదారులు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఇప్పటి వరకు రాజీవ్ యువ వికాసం పథకంపై అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేక పోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

రూ.50వేల వరకు పూర్తి సబ్సిడీ

రూ.50వేల వరకు రుణం తీసుకునే నిరుద్యోగులకు పూర్తి స్థాయిలో సబ్సిడీ ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఆపై రుణాలకు బ్యాంకు లింకేజీల ద్వారా ఇస్తూ యూనిట్ విలువ ఆధారంగా సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ, యువకులు స్వయం ఉపాధి పొందడానికి ప్రభుత్వం 81 యూనిట్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పించింది.

నర్సాపూర్‌లో జోరుగా వర్షం

నర్సాపూర్: పట్టణంలో మంగళవారం రాత్రి జోరుగా వర్షం కురిసింది. సంతలో కూరగాయల ఇతర సరుకులు అమ్మేందుకు వచ్చిన వ్యాపారులతో పాటు కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలు వర్షంతో ఇబ్బందులు పడ్డారు. కొన్ని రోజులుగా రోజూ చీకటి పడగానే వర్షం పడడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

త్వరితగతిన ఏటీసీ భవన నిర్మాణ పనులు

కలెక్టర్ రాహుల్‌రాజ్


ఏటీసీ సెంటర్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రమైన హవేళిఘణాపూర్ శివారులో నిర్మిస్తున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవన నిర్మాణ పనులను కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం పరిశీలించారు. భవన నిర్మాణంలో పాటిస్తున్న నాణ్యత ప్రమాణాలు, మిగిలిపోయిన పనులను గురించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యాధునిక సాంకేతిక విద్యనందించి ఉపాధి అవకాశాలు పెంచాలనే ఉద్దేశంతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట ఐటీఐ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఇంటస్ట్రియల్ ఇన్‌ఫాస్ట్రక్చర్ కార్పొరేషన్ జోనల్ మేనేజర్ అనురాధ, డీఈ రాందాస్, వాణిలత పాల్గొన్నారు.

జీఓ 12ను వెంటనే సవరించాలి

భవన నిర్మాణ రంగ కార్మికుల యూనియన్ నేతల డిమాండ్


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భవన నిర్మాణ రంగ కార్మికులు

మెదక్ కలెక్టరేట్: భవన నిర్మాణ సంక్షేమ పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించే జీఓ నంబర్ 12ను వెంటనే సవరించాలని తెలంగాణ భవన నిర్మాణ రంగ కార్మికుల యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి చింతల గౌరయ్య మాట్లాడుతూ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారానే సంక్షేమ పథకాలు అందించాలని, అక్రమంగా ప్రైవేట్ బీమా కంపెనీలకు ఇచ్చిన రూ.346 కోట్లు తిరిగి వెల్ఫేర్ బోర్డులోనే జమ చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీ నియమించి, వారి నిర్ణయం ప్రకారం వెల్ఫేర్ బోర్డు నిధులను ఖర్చు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్, తెలంగాణ బిల్డింగ్ ఇతర నిర్మాణ సంఘాల నాయకులు అఫ్జల్, స్వామి, భిక్షపతి, చందు, పవన్ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పెంపకంతో అధిక ఆదాయం

- పశుసంవర్ధకశాఖ ఏడీఏ జనార్ధన్
- కేవీకేలో పెంపకందారుకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, పెంపకందారులు

కౌడిపల్లి(నర్సాపూర్): గొర్రెలు, మేకల పెంపకంతో అధిక ఆదాయం పొందవచ్చని నర్సాపూర్ పశుసంవర్ధకశాఖ ఏడీఏ జనార్ధన్ తెలిపారు. మంగళవారం మండలంలోని తునికి కేవీకేలో నేషనల్ మీట్ రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో గొర్లు, మేకల పెంపకందారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గొర్రెలు, మేకల మాంసానికి మంచి డిమాండ్ ఉందన్నారు. ప్రభుత్వం సైతం పెంపకందారులకు సబ్సిడీ అందచేస్తుందన్నారు. జిల్లాలో 5లక్షల గొర్రెలు, 4.5లక్షలు మేకలు ఉన్నాయన్నారు. మేలు జాతిని పెంచడంతో ఆదాయం బాగుంటుందన్నారు. వ్యాధులు సోకితే పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్యం చేస్తారని, వాక్సిన్స్ సైతం ఇస్తారని చెప్పారు. అనంతరం డాక్టర్ యేగేష్ మాట్లాడుతూ దేశంలో 77శాతం మాంసాహారులు ఉన్నారని, గొర్రెలను పెంచడంతో వాటిని అమ్మగా వచ్చిన ఆదాయంతోపాటు వారి ఎరువుకు సైతం ఆదాయం వస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేవీకే హెడ్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్, శాస్త్రవేత్త శ్రీకాంత్ వివిధ గ్రామాల పెంపకందారులు పాల్గొన్నారు.

ఆలయ భూమిని కబ్జా చేస్తే ఊరుకోం


గ్రామస్తులను సముదాయిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

- అంబాజీపేట గ్రామస్తుల రాస్తారోకో
- పనులు చేయించేందుకు వచ్చిన వ్యక్తిని చితకబాదిన వైనం

చిన్నశంకరంపేట(మెదక్): దుర్గామాత ఆలయానికి సంబంధించిన స్థలాన్ని కబ్జా చేస్తే ఊరుకునేది లేదని చిన్నశంకరంపేట మండలంలోని అంబాజీపేట గ్రామస్తులు తేల్చి చెప్పారు. కబ్జా చేసిన స్థలంలో ప్రహరీ గోడ నిర్మించేందుకు రియల్టర్ తరఫు మనిషి పనులు చేయించేందుకు రాగా అతడిని గ్రామస్తులు చితకబాది వెనక్కి పంపించారు. ఆలయ భూమి కాపాడాలంటూ మెదక్–చేగుంట ప్రధాన రహదారిపై రెండు గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో వెలసిన దుర్గామాత ఆలయం ముందు ఖాళీ స్థలాన్ని హైదరాబాద్‌కు చెందిన ఓ రియల్టర్ కబ్జా చేయగా ఈ విషయమై అప్పటి నుంచి సదరు గ్రామస్తులకు అతడికి మధ్య వివాదం నడుస్తోంది. తాజాగా సదరు రియల్టర్ అక్కడ ప్రహరీ నిర్మించేందుకు అతడి తరఫున ఓ వ్యక్తిని పనుల నిమిత్తం అక్కడకు పంపించాడు. అయితే పునాదులు తవ్వుతుండగా విషయం తెలుసుకున్న గ్రామస్తులు పనులు నిలిపి వేయించి అతడిని చితకబాదారు. అనంతరం ఆలయ భూమిని కాపాడాలంటూ రోడ్డుపై రాస్తారోకో చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపచేశారు. అనంతరం డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ వెంకటరాజంగౌడ్ దుర్గామాతను దర్శించుకుని మొక్కుకున్నారు.

పారదర్శకత విజయ ప్రత్యేకత

- నాణ్యమైన పాల సరఫరాయే లక్ష్యం
- జీఎం మధుసూదన్ రావు


మాట్లాడుతున్న జీఎం మధుసూదన్ రావు

మెదక్ కలెక్టరేట్: పారదర్శకత విజయ డెయిరీ ప్రత్యేకత అని రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ మధుసూదన్ రావు తెలిపారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని విజయ డెయిరీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్ష చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారులకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. స్వచ్ఛమైన పాల సేకరణ, సరఫరాపై ప్రధానంగా దృష్టి సారించినట్లు చెప్పారు. రైతుల నుంచి పాలు సేకరించే సమయంలోనే ఎనలైజర్లతో పరీక్షించి కొనుగోలు చేస్తున్నామన్నారు. విజయ డెయిరీపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెడుతున్నట్లు తెలిపారు. పలు రకాల పరీక్షలు చేసిన తర్వాతే వినియోగదారులకు నాణ్యతా ప్రమాణాలతో కూడిన పాల పదార్థాలు అందిస్తున్నామన్నారు. జిల్లాలో పలు రద్దీ ప్రాంతాల్లో విక్రయ కేంద్రాలను గుర్తిస్తామని, ఇందు కోసం ప్రత్యేక బృందాలతో సర్వే చేయిస్తామని చెప్పారు. సమావేశంలో అధికారులు, ప్రసన్న, కల్యాణి, విజయ్, అవినాష్, రమేష్, మెదక్ , జహీరాబాద్, నారాయణఖేడ్ కేంద్రాల మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పైసలున్నా పనులేవీ..?

- పెచ్చులూడి.. వర్షపునీరు వచ్చి..
- అందులోనే తరగతుల నిర్వహణ
- భయాందోళనలో విద్యార్థులు


తరగతి గదిలో పైకప్పు పెచ్చులు ఊడి పైనుంచి వర్షపు నీరు వచ్చి తడిసిన గోడలు


తరగతి గదిలో పాకర పట్టిన గోడలు, ఊడిపోయిన కిటికీ తలుపులు

నర్సాపూర్: పెచ్చులూడిన గదుల్లోనే ఉపాధ్యాయులు తరగతులు నిర్వహిస్తున్నారు. ఎప్పుడేం జరుగుతుందోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు కావడంతో పనులు చేపట్టిన కాంట్రాక్టరు కొన్ని పనులు చేపట్టి అర్ధంతరంగా ఏడాది క్రితం నిలిపివేశాడు. సదరు కాంట్రాక్టర్‌పై గిరిజన గురుకుల సంస్థ అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నర్సాపూర్‌లోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాలకు మరమ్మతులు చేపట్టేందుకు గత ఏడాది ప్రభుత్వం రూ. 2కోట్లు మంజూరు చేసింది. అప్పట్లోనే మరమ్మతు పనులను ఓ కాంట్రాక్టరు చేపట్టి కొన్ని పనులు చేశాడు. కాగా గత ఏడాది అక్టోబరులో పనులు ఆపివేశాడు. ఇంత వరకు మిగిలిన పనులను అధికారులు చేయించకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

పాఠశాలలోని పలు తరగతి గదుల పైకప్పుల పెచ్చులు ఇప్పటికే ఊడిపోయి వర్షం వచ్చినప్పుడు నీరు కిందికి కారుతోంది. భయపడుతూ ఆ గదుల్లోనే తరగతులు కొనసాగిస్తున్నారు. గదుల పైకప్పు పాడై వర్షానికి ఎక్కువగా నీరు కారుతున్న కొన్ని గదులకు తాళం వేసి వాడటం లేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కాగా బాలుర టాయిలెట్స్‌కు మరమ్మతులు చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో విద్యార్థులు అత్యవసరమైనప్పుడు బయటకు వెళుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా పాఠశాల భవనంతో పాటు హాస్టల్ భవనం కిటికీలకు తలుపులు బిగించకపోవడంతో రాత్రి ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోయారు. భవనాల గోడలు పాకురు పట్టి చాలా అధ్వాన్నంగా కనిపిస్తున్నాయి. అలాగే మీటింగ్ హాలుకు మరమ్మతులు చేసేందుకు కిటికీలు తొలగించి వదిలేశారు. ఏదైనా సమావేశం ఏర్పాటు చేయాల్సి వస్తే ఏడాది నుంచి చిన్న గదుల్లోనే నిర్వహిస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

ఉన్నతాధికారులకు చెప్పాం..



పాఠశాలలో నెలకొన్న సమస్యలు, మరమ్మతులు నిలిచిపోయిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరమ్మతులు చేయకపోవడంతో ఉపాధ్యాయులతోపాటు విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని వివరించాం. – కృష్ణ కిశోర్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్

సర్కారీ చదువులు సాఫీగా సాగేనా!

- వసతుల్లేని బడులు ఒకే గొడుగు కిందకు..
- తీరనున్న ఉపాధ్యాయుల కొరత
- సర్కార్ నిర్ణయంపై సర్వత్రా హర్షం

మెదక్‌జోన్ : ప్రాథమిక విద్య అందరికి అందించాలనే ఉద్దేశంతో వసతులు లేని 4 నుంచి 5 బడులను ఒకే చోటకు చేర్చి బోధన సాగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో ఉపాధ్యాయుల కొరత కూడా తీరనుంది. దూరం నుండి వచ్చే విద్యార్థులకు రవాణా ఖర్చులు, ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం అందించనుంది. మెదక్ జిల్లా వ్యాప్తంగా 146 హైస్కూల్స్, 128 ప్రాథమికోన్నత, 628 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 63,217 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కాగా 4,044 ఉపాధ్యాయులు ఉండాలి. కానీ ప్రస్తుతం ఉన్న టీచర్లు 3,522 మంది మాత్రమే. ఈ లెక్కన ఇంకా 522 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా చాలామంది పేద విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరం అవుతున్నారు. ఇలాంటి పాఠశాలలను ముందుగా గుర్తించి 3 నుంచి 4 పాఠశాలలను ఒకే చోటకు చేర్చితే ఉపాధ్యాయుల కొరత తీరుతుంది. కాగా దూరం నుండి విద్యార్థులకు రవాణా ఖర్చులు, ఉదయం అల్పాహారం, స్నాక్స్, మధ్యాహ్న భోజనం ఇవ్వనున్నారు. కాగా నర్సరీ నుండి 4వ తరగతి, 5 నుండి 8వ తరగతి, 9 నుండి ఇంటర్‌మీడియెట్ వరకు మూడు విభాగాలుగా విభజించనున్నారు. జూనియర్ కళాశాలలు ఆయా మండల కేంద్రాలతో పాటు మున్సిపాలిటీలు, జిల్లా కేంద్రాల్లోనే ఉన్నాయి. ముందుగా నర్సరీ నుండి 4వ తరగతి వరకు ఉన్న బడుల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపాలని ముఖ్యమంత్రి విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

మెరుగుపడనున్న విద్య

వసతుల లేమితో ఉన్నటువంటి 4 నుంచి 5 పాఠశాలలను ఒకేచోటకు చేర్చి బోధిస్తే విద్య మరింతగా మెరుగు పడుతుంది. ఇలాంటి నిర్ణయంతో జిల్లాలో ఉన్న 235 ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరుతుంది. – రాధాకిషన్, జిల్లా విద్యాధికారి, మెదక్

ఉచిత శిక్షణ.. ఉపాధి

మహిళలకు బాసటగా గ్రామీణ ఉపాధి శిక్షణ సంస్థ

- ఉపాధితో పాటు రుణాలు
- లబ్ధి పొందుతున్న మహిళలు

సంగారెడ్డి టౌన్‌ : గ్రామాల్లోని నిరుద్యోగులు, మహిళలు స్వయం ఉపాధి పొందడానికి నైపుణ్య శిక్షణను ఉచితంగా అందిస్తున్నాయి. ఎస్‌బీఐ వంటి బ్యాంకులు ఈ సంస్థలను నిర్వహిస్తూ, శిక్షణ పొందిన వారికి వ్యాపారాలు ప్రారంభించుకోవడానికి ఆర్థిక సహాయం అందిస్తున్నాయి. మహిళలు స్వయం సమృద్ధి సాధించి ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఈ శిక్షణ సహాయపడుతుంది. శిక్షణ నిస్తూ ఉపాధి కల్పిస్తూ వారి బంగారు భవిష్యత్‌కు సంగారెడ్డిలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ బాటలు వేస్తోంది.

ఎస్బీఐ సౌజన్యంతో మహిళలకు అనేక రంగాల్లో ఉచితంగా శిక్షణ ఇస్తూ ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. శిక్షణతోపాటు ఉచితంగా భోజనం, వసతి కల్పించడమే కాకుండా వ్యాపార రుణాలను సైతం మంజూరు చేయిస్తుంది. వేలాది మంది ఉద్యోగాలు పొంది స్థిరపడ్డారు. సంగారెడ్డి, మెదక్‌ జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు చెందిన మహిళలకు టైలరింగ్‌, మగ్గం వర్క్‌, కుట్టు మిషన్‌, బ్యూటీ పార్లర్‌, కంప్యూటర్‌ శిక్షణ, కోర్సులను ఉచితంగా అందజేస్తున్నారు. వారితో పాటు పురుషులకు మోటార్‌ వెహికల్‌, ఫొటోగ్రఫీ, సీసీ కెమెరా, వైరింగ్‌లో శిక్షణతోపాటు భోజనం సదుపాయం కల్పిస్తున్నారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్లు, కోర్సుకు సంబంధించిన కిట్లను అందజేస్తున్నారు. వేలాది మంది నిరుద్యోగ మహిళలు శిక్షణ తీసుకునేందుకు తరలివస్తున్నారు.


కుట్టు మిషన్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు


మగ్గం వర్క్‌ శిక్షణలో..

ఇప్పటి వరకు.. 448 బ్యాచ్‌లు

2010 జూన్‌ 7వ తేదీన ప్రారంభమైన ఈ శిక్షణ సంస్థ ద్వారా ఇప్పటి వరకు 448 బ్యాచ్‌లు శిక్షణ ఇవ్వగా అందులో మహిళలు, పురుషులు 11,898 శిక్షణ తీసుకున్నారు. కాగా 9138 మంది వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. వారిలో 3347 మందికి బ్యాంకు రుణాలు మంజూరయ్యాయి. శిక్షణలో భాగంగా వ్యక్తిత్వ వికాసం, వ్యాపార సంబంధ బ్యాంకింగ్‌ విషయాలపై సైతం అవగాహన కల్పిస్తున్నారు. 30 రోజులపాటు పూర్తిగా శిక్షణ ఇస్తున్నారు. మహిళలు షాపులను ఏర్పాటు చేసుకునేందుకు బ్యాంకుల ద్వారా రూ.50 వేల నుండి రూ.5 లక్షల వరకు రుణాలు అందజేస్తున్నారు. వారు ఉపాధి పొందడంతో పాటు మరో నలుగురికి శిక్షణ ఇస్తున్నారు.

సొంతంగా దుకాణం పెడతా



ప్రస్తుతం మగ్గం వర్క్‌కు మంచి డిమాండ్‌ ఉంది. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా ఉచితంగా శిక్షణ పొందుతున్నాను. శిక్షణ అనంతరం దుకాణానికి కావాల్సిన రుణం తీసుకొని, మరో నలుగురికి ఉపాధి కల్పిస్తా.

– నిఖిత కల్హేర్‌ మండలం, రాపర్తి గ్రామం

నిరుద్యోగ మహిళలకు ఉపాధి



మహిళలకు ఉచితంగా శిక్షణ కల్పించి బ్యాంకు ద్వారా రుణాలు అందజేస్తాం. ఆర్థికంగా స్థిర పడేందుకు మంచి అవకాశం ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

– రాజేశ్‌ కుమార్‌, డైరెక్టర్‌, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ

బేకరీకి రూ.2 వేల జరిమాన


కాలం చెల్లిన కేక్‌

దుబ్బాకటౌన్‌: బేకరీకి అధికారులు రూ.2 వేల జరిమాన విధించారు. దుబ్బాక పట్టణంలో బేకరీలో అపరిశుభ్ర వాతావరణంలో నాణ్యతలేని తిను బండారాలను తయారు చేస్తూ, గడువు ముగిసిన వాటిని విక్రయిస్తుండటంతో మున్సిపల్‌ మేనేజర్‌ శ్రీనివాస్‌ జరిమాన విధించినట్లు తెలిపారు. మంగళవారం సిబ్బందితో బేకరీని తనిఖీ చేసి, ఆహార పదార్థాల తయారీ గది, స్టోర్‌ రూమ్‌, ఇతర తినుబండారాలను పరిశీలించారు. అపరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు తయారు చేస్తున్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే కాలం చెల్లిన తినుబండారాలను గమనించారు. మరోసారి నాణ్యతలేని ఆహార పదార్థాలను విక్రయిస్తే, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌చార్జ్‌ శ్రీకాంత్‌, మున్సిపల్‌ సిబ్బంది తదితరులున్నారు.

తల్లీముగ్గురు పిల్లలు అదృశ్యం

పటాన్‌చెరు టౌన్‌: తల్లీ ముగ్గురు పిల్లలు అదృశ్యమయ్యారు. ఎస్‌ఐ వెంకటరెడ్డి వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రానికి చెందిన శరణప్ప బతుకుదెరువు కోసం పదేళ్ల క్రితం భార్య, ముగ్గురు పిల్లలతో వచ్చి ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని హనుమాన్‌ దేవస్థానం వద్ద ఉంటున్నాడు. వృత్తిరీత్యా డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 18న శరణప్ప డ్రైవింగ్‌ పనిపై బయటకు వెళ్లి తిరిగి మరుసటి రోజు ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి భార్య దుర్గమ్మ, ముగ్గురు పిల్లలు ధన్‌రాజ్‌(13), నాగరాజ్‌(8), రమాదేవి(7) కనిపించలేదు. దీంతో తెలిసిన వారి వద్ద, స్థానికంగా, స్వగ్రామం కర్ణాటకలో వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం పటాన్‌ చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


దుర్గమ్మ, ముగ్గురు పిల్లలు

పిడుగు పాటుకు మూగజీవాలు మృత్యువాత


నంగునూరులో మృత్యువాత పడిన మేకలను చూసి విలపిస్తున్న కుటుంబ సభ్యులు

నంగునూరు(సిద్దిపేట): పిడుగు పాటుకు గురై పాడి గేదె, గొర్లు, మేకలు మృతి చెందాయి. ఈ ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. మగ్దుంపూర్‌కు చెందిన మంత్రి బాలరాజు వ్యవసాయ బావి వద్ద చెట్టుకు గేదెను కట్టేయగా పిడుగు పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. రోజుకు 14 లీటర్ల పాలు ఇచ్చే గేదె మృతి చెందడంతో రూ.లక్షా 50 వేల నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. అలాగే నంగునూరు మంధిర సంతోష్‌నగర్‌కు చెందిన ఇరగదిండ్ల సాయిలు గొర్లు, మేకలను మేతకు వదిలాడు. ఒక్కసారిగా వర్షం కురవడంతో చెట్టు కిందికి వెళ్లిన ఐదు మేకలు, రెండు గొర్లు అక్కడికక్కడే మృతి చెందాయి.

గురువన్నపేటలో విద్యుత్‌ షాక్‌తో..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని గురువన్నపేట గ్రామంలో విద్యుత్‌షాక్‌కు గురై నాలుగు గొర్రెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన కొన్నె లింగం గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తన గొర్రెలను మేపేందుకు రోజులాగే మామిడితోటకు తీసుకెళ్లాడు. తోటకు ఉన్న పెన్సింగ్‌ వైరుకు విద్యుత్‌ వైరు తగిలి షాక్‌ రావడంతో నాలుగు గొర్రెలు మృతి చెందాయి. దాదాపు రూ.40 వేల వరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

విద్యుదాఘాతంతో తాపీమేస్త్రి మృతి


నారాయణశర్మ

వెల్దుర్తి(తూప్రాన్‌) : తాపీమేస్త్రి విద్యుదాఘాతంతో మృతిచెందాడు. ఈ ఘటన మండల కేంద్రం వెల్దుర్తిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రాజు వివరాల ప్రకారం... బీహార్‌కు చెందిన పలువురు భవన నిర్మాణ కార్మికులు బతుకుదెరువు కోసం వలసవచ్చి ఓ కాంట్రాక్టర్‌ వద్ద పనిచేస్తున్నారు. వారంతా కాంట్రాక్టర్‌కు చెందిన డబుల్‌ బెడ్‌ రూంలో ఉంటున్నారు. రోజూమాదిరిగా సోమవారం పనికి వెళ్లి రాత్రి రూముకు వచ్చే సరికి ఇంట్లో కరెంట్‌ లేకపోవడంతో డాబాపైకి వెళ్లి పరిశీలించగా విద్యుత్‌ తీగ తెగిపోయి ఉంది. భారీ వర్షం కురుస్తుండగానే గొడుగు పట్టుకొని విద్యుత్‌ తీగలు అతికిస్తుండగా నారాయణశర్మ(37)కు ప్రమాదవశాత్తు షాక్‌ తగలడంతో వెనక ఉన్న పిల్లర్‌పై పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే తూప్రాన్‌ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు.

టీ తాగేందుకు రోడ్డు దాటుతుండగా..

- బొలెరో ఢీకొని వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్‌: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... వికారాబాద్‌ తాండూర్‌కు చెందిన పంపరప్ప, మరి కొందరితో కలిసి తాండూర్‌ నుంచి లారీలో సోమవారం రాత్రి రామచంద్రాపురం బయలు దేరారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారు జామున పటాన్‌చెరు సమీపంలోకి రాగానే టీ తాగేందుకు ఆగి.. రోడ్డు దాటుతుండగా లింగంపల్లి వైపు నుండి సంగారెడ్డి వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు.

ఫోన్‌ అపహరించి.. రూ.3.60 లక్షలు డ్రా

పటాన్‌చెరు టౌన్‌: బస్సు ఎక్కుతుండగా ఫోన్‌ను అపహరించి.. దాని నుండి సైబర్‌ నేరగాళ్లు నగదును కాజేశారు. పోలీసుల వివరాల ప్రకారం ... ఇస్నాపూర్‌కు చెందిన రిటైర్డ్‌ ప్రైవేట్‌ టీచర్‌ గత నెల 31న ఉదయం ఇస్నాపూర్‌ చౌరస్తా నుండి బీదర్‌ వెళ్లడానికి బస్సు ఎక్కుతుండగా తన ఫోన్‌ను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ఇతరుల ఫోన్‌తో కాల్‌ చేయగా స్విచ్‌ ఆఫ్‌ వచ్చింది. తిరిగి సెప్టెంబర్‌ 7న కొత్త సిమ్‌ తీసుకొని వేసుకున్నాడు. అదే రోజు బ్యాంకులో నగదు తీసుకునేందుకు వెళితే రూ.3.లక్షల 60 వేలు తన ఖాతా నుండి డ్రా చేసినట్టు చెప్పారు. దీంతో సైబర్‌క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంట్లో చోరీ

మద్దూరు(హుస్నాబాద్‌): ఇంట్లో దొంగలు పడి సామగ్రిని ఎత్తుకెళ్లారు. వివరాలు ఇలా... దూల్మిట్ట మండలంలోని బెక్కల్‌ గ్రామంలో ఈ నెల 21న తాళం వేసి ఉన్న ఎర్రోజు రామబ్రహ్మం ఇంట్లో రూ.25వేల విలువ చేసే ఇత్తడి, స్టీల్‌ సామగ్రితో పాటు వెండి వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారు. వృత్తిరీత్యా సిద్దిపేటలో ఉంటున్న రామబ్రహ్మం ఈనెల 22న స్వగ్రామానికి వచ్చి తన ఇంటిని చూడగా కిటికీలు తొలగించి ఉన్నాయి. అదే రోజు గ్రామంలోని ఎస్సీ కాలనీలో సైతం దొంగలు పలు ఇండ్లలో చోరీకి పాల్పడ్డారు. కాగా బాధితుడు మద్దూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మందుబాబులకు జరిమాన

సిద్దిపేటకమాన్‌: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు మంగళవారం జరిమాన విధించింది. ట్రాఫిక్‌ సీఐ ప్రవీణ్‌కుమార్‌ వివరాల ప్రకారం... పట్టణంలోని పలు ప్రాంతాల్లో కొన్ని రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 50మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజ రుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి వారికి రూ.38,200 జరిమాన విధించారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

జిన్నారం (పటాన్‌చెరు): తాగడానికి నీళ్లడిగి మెడలోని పుస్తెలతాడు అపహరించిన ఘటన గుమ్మడిదలలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ లక్ష్మీకాంత్‌ రెడ్డి వివరాల ప్రకారం... పట్టణ పరిధిలోని భగత్‌ సింగ్‌ కాలనీకి చెందిన రాధమ్మ అనే వృద్ధురాలు సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉంది. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తి వచ్చి తాగడానికి నీళ్లు ఇవ్వమని అడిగాడు. వంటగదిలో నుండి తీసుకొచ్చి ఇచ్చే క్రమంలో ఆమె మెడలో ఉన్న 5 తులాల పుస్తెలతాడును లాక్కొని పరిగెత్తాడు. దీంతో వృద్ధురాలు అరుపులకు చుట్టుపక్కల వాళ్లు వచ్చే సరికి దుండగుడు పరారయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

సీపీ అనురాధ


సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్‌: రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీపీ అనురాధ తెలిపారు. మంగళవారం పోలీసు కమిషనర్‌ కార్యాలయంలో హుస్నాబాద్‌ డివిజన్‌ పోలీసు అధికారులతో పెండింగ్‌ కేసులపై సీపీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెండింగ్‌ కేసులు త్వరగా పరిష్కరించాలన్నారు. కేసు నమోదైన వెంటనే నిందితులను అరెస్టు చేయాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసుల్లో 60 రోజుల్లో ఇన్వెస్టిగేషన్‌ పూర్తి చేసి, కోర్టులో చార్జిషీట్‌ దాఖలు చేయాలని సూచించారు. డయల్‌ 100కు వెంటనే స్పందించి ఘటనా స్థలానికి వెళ్లాలన్నారు. హోంగార్డులతో నిర్వహించిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ హోంగార్డుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో అదనపు డీసీపీ అడ్మిన్‌ కుశాల్కర్‌, ఏఆర్‌ అదనపు డీసీపీ సుభాష్‌ చంద్రబోస్‌, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట

రాష్ట్ర స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌ శివసేనారెడ్డి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న శివసేనారెడ్డి

దుబ్బాక : గత ప్రభుత్వం పదేళ్లలో క్రీడల కోసం 350 కోట్లు కేటాయిస్తే, సీఎం రేవంత్‌రెడ్డి రెండేళ్లలో రూ.850 కోట్లు కేటాయించారని రాష్ట్ర స్పోర్ట్స్‌ అథారిటీ చైర్మన్‌ శివసేనారెడ్డి అన్నారు. మంగళవారం దుబ్బాక మున్సిపల్‌ లచ్చపేట మాడల్‌ స్కూల్‌లో పీవీఆర్‌ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన వాలీబాల్‌ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడల్లో నేషనల్‌, ఇంటర్నేషనల్‌ స్థాయికి వెళ్లిన విద్యార్థులకు పీడీ(ఫిజికల్‌ డైరెక్టర్‌), క్రీడా అభివృద్ధి శాఖల అధికారులుగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలనే ఆలోచనను సీఎం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. క్రీడా అకాడమీలను పెట్టి క్రీడాకారులను తయారు చేయడంపై దృష్టి సారించామని చెప్పారు. క్రీడల్లో దేశంలోనే తెలంగాణను అగ్రగామిగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం కప్‌ను గ్రామస్థాయి నుంచి నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షులు పన్యాల శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌ రమేశ్‌కుమార్‌ తదితరులు ఉన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్‌ఐ

విద్యుత్‌షాక్‌కు గురైన మహిళను ఆస్పత్రికి తరలింపు

గజ్వేల్‌రూరల్‌: మెట్లు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు ఓ మహిళ విద్యుత్‌షాక్‌కు గురైంది. గమనించిన ఎస్‌ఐ రఘుపతి వెంటనే ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నాడు. ఈ ఘటన మంగళవారం గజ్వేల్‌లో చోటు చేసుకుంది. వివరాలు.. తొగుట గ్రామానికి చెందిన చింత లక్ష్మి గజ్వేల్‌ పట్టణంలోని వినాయక ఫర్నీచర్‌ దుకాణంలోకి వెళ్లేందుకు మెట్లు ఎక్కుతుండగా అదుపుతప్పి ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న సర్వీస్‌ వైర్లను ఆసరా కోసం పట్టుకుంది. ఈ ఘటనలో విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయింది. ఇదే సమయంలో అటుగా వెళ్తున్న ఎస్‌ఐ రఘుపతి ప్రమాదతీరును గుర్తించి సిబ్బంది, స్థానికులతో కలిసి ఆమెను 108 వాహనంలో గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం బాధిత మహిళ కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

భార్య మందలించడంతో..


కీసరి రాజు

వర్గల్‌(గజ్వేల్‌): పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని మీనాజీపేటలో జరిగింది. గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కీసరి రాజు(30) మద్యానికి బానిసై రోజూ భార్యతో గొడవపడేవాడు. ఈ నెల 9న రాత్రి మద్యం తాగి వచ్చిన భర్తను భార్య మహేశ్వరి మందలించింది. ఇంటి నుంచి వెళ్లిపోయిన రాజు అర్ధరాత్రి తిరిగొచ్చి నిద్రపోయాడు. ఉదయం వాంతులు చేసుకుంటున్న అతడు పురుగుల మందుతాగినట్లు చెప్పాడు. వెంటనే ములుగు సమీపంలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు.

ఊరెళ్లే విషయంలో వివాహిత..

సిద్దిపేటకమాన్‌: భర్తతో జరిగిన గొడవతో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా... కడపకు చెందిన సతీశ్‌కు అదే ప్రాంతానికి చెందిన అనురాధ (26)తో ఈ ఏడాది ఏప్రిల్‌లో వివాహం జరిగింది. భార్యాభర్తలు బతుకుదెరువు నిమిత్తం సిద్దిపేటకు వచ్చి స్థానిక రేణుక నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. సతీశ్‌ ఓ కంపెనీలో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. పండుగకు ఊరెళ్లే విషయంలో భార్యాభర్తల మధ్య మంగళవారం ఉదయం గొడవ జరిగింది. ఇదే క్రమంలో భర్త ఉదయం డ్యూటీకి వెళ్లగా అనురాధ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

పది మంది విద్యార్థులకు అస్వస్థత

రామాయంపేట ఆస్పత్రిలో చికిత్స


విద్యార్థులను పరామర్శిస్తున్న కలెక్టర్‌, డీఎంహెచ్‌వో

చేగుంట(తూప్రాన్‌)/రామాయంపేట(మెదక్‌): పది మంది మదర్సా విద్యార్థులు ఫుడ్‌ పాయిజన్‌తో అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన మండలంలోని ఇబ్రహీంపూర్‌ గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, విద్యార్థుల వివరాల ప్రకారం... సాయంత్రం గ్రామంలోని మదర్సాలో విద్యార్థులు అన్నం, పప్పు, ఆలుఖుర్మాతో భోజనం చేసి పడుకున్నారు. అర్ధరాత్రి నుండి మోల్‌సాబ్‌ హఫీస్‌ నసీంతో పాటు విద్యార్థులు మొజాంబిల్‌, జఫార్‌, నజార్‌, బసార్‌, సలావుద్దిన్‌, బాబూ, సాలీఖ్‌, జంషేద్‌, ముస్తాకీంలు వాంతులు, విరేచనాలు కడుపునొప్పితో బాధపడ్డారు. దీంతో వీరందరిని అదేరోజు రాత్రి అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డీసీహెచ్‌ఓ శివదయాల్‌ ఆధ్వర్యంలో చికిత్స అందించారు. కలుషిత ఆహారంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారించినట్లు తెలిపారు. 48 గంటలు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి పంపించనున్నట్లు చెప్పారు.

విద్యార్థులకు కలెక్టర్‌ పరామర్శ

అస్వస్థతకు గురైన విద్యార్థులను మంగళవారం కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌, ఇన్‌చార్జి జిల్లా వైద్యాధికారి సృజన, డీసీహెచ్‌ఓ శివదయాల్‌ పరామర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్‌ స్కూళ్లు, హోటళ్లలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. రెస్టారెంట్లలో త్వరలో తనిఖీలు చేయిస్తామన్నారు. ఈ మేరకు వైద్యశాఖకు చెందిన టీంను ఇబ్రాహీంపూర్‌ మదర్సాకు పంపించామని తెలిపారు. కలెక్టర్‌ వెంట కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ లింబాద్రి, డాక్టర్లు ఉన్నారు.

తండాల్లో ఆధ్యాత్మిక సందడి

- సేవాలాల్‌ దీక్ష తీసుకునేందుకు యువత ఆసక్తి
- బంజారాల్లో వెల్లివిరుస్తున్న భక్తి భావం

గిరిజనులు సంత్‌ సేవాలాల్‌ మహరాజ్‌ను ఆరాధిస్తారు. ఆయన పేరు వింటే భక్తి పారవశ్యంలో మునిగిపోతారు. ప్రస్తుతం గిరిజనులు సేవాలాల్‌ దీక్షలు స్వీకరిస్తూ ఆయన నామస్మరణ చేస్తున్నారు. దీంతో తండాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొన్నది.

జహీరాబాద్‌ టౌన్‌: జిల్లాలోని జహీరాబాద్‌, నారాయణఖేడ్‌, నర్సాపూర్‌ తదితర ప్రాంతాల్లో గిరిజన తండాలు అధికంగా ఉన్నాయి. విజయదశమిని పురస్కరించుకుని గిరిజనులు తమ ఆరాధ్య గురువైన సేవాలాల్‌ మహరాజ్‌ దీక్షలు తీసుకుంటారు. ప్రతి సంవత్సరం దసరా పండుగకు ముందు 11 రోజుల పాటు భక్తిశ్రద్ధలతో దీక్షలు చేపడుతారు. ప్రస్తుతం సేవాలాల్‌ దీక్షలు ప్రారంభమయ్యాయి. దీక్షలు తీసుకునేందుకు యువత ఆసక్తి చూపుతున్నారు. చిన్నా పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ జగదాంబ మాత, సేవాలాల్‌ మహరాజ్‌లను కొలుస్తూ భక్తిభావంతో మునిగిపోతారు. ఈ సందర్భంగా దీక్షాపరులు సామూహిక పూజలు, భజనలు, కీర్తనలు చేస్తారు. అయ్యప్పస్వామి, శివ దీక్ష, హనుమాన్‌ దీక్షల మాదిరిగానే సేవాలాల్‌ దీక్షలో కూడా కఠిన నియమాలు ఉంటాయి. ఇళ్లకు దూరంగా ఉంటూ సూర్యోదయానికి ముందుగానే నిద్రలేచి చన్నీటి స్నానం చేసి భవానీ మాత, సేవాలాల్‌ మహరాజ్‌ చిత్రపటాలకు పూజలు చేస్తారు. ఒక్కపూట భోజనం తదితర కఠిన నియమాలను అనుసరిస్తారు. ప్రతీ సంవత్సరం దీక్షలు తీసుకునేవారి సంఖ్య పెరుగుతుంది. జహీరాబాద్‌ , నర్సాపూర్‌ తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సేవాలాల్‌ దీక్షలు తీసుకోవడంతో తండాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.


సేడాగుట్ట తండాలో సేవాలాల్‌ దీక్ష తీసుకున్న యువత

భక్తి భావం పెరుగుతుంది



నేను కొన్నేళ్ల నుంచి దీక్ష చేపడుతున్న. సేవాలాల్‌ దీక్షలు తీసుకున్న వారిలో భక్తిభావం, ఏకతా భావం పెరుగుతుంది. చెడు వ్యసనాలకు లోనై యువత ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. దీక్షల వల్ల చెడు ఆలోచనలు తగ్గి సన్మార్గంలో నడుస్తారు. జహీరాబాద్‌ ప్రాంతంలోని 54 తండాల్లో యువత సేవాలాల్‌ దీక్షలు తీసుకున్నారు. ఉద్యోగస్తులు కూడా దీక్షలు తీసుకునేందుకు ముందుకు వస్తున్నారు.

– రవిరాథోడ్‌, గురుస్వామి, మల్‌చెల్మ తండా

క్లుప్తంగా

'నవోదయ'కు గడువు పెంపు

వర్గల్‌(గజ్వేల్‌): ఉమ్మడి మెదక్‌జిల్లా వర్గల్‌ నవోదయలో 2026–27 విద్యాసంవత్సరం 9వ, 11వ తరగతులలో ఖాళీ సీట్లలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణకు గడువును అక్టోబర్‌ 7 వరకు పొడిగిస్తూ నవోదయ విద్యాలయ సమితి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు విద్యాలయ ప్రిన్సిపాల్‌ దాసి రాజేందర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ గడువు మంగళవారం ముగియాల్సి ఉండగా, విద్యార్థుల ప్రయోజనం కోసం పొడిగించారు. ఉమ్మడి జిల్లాలోని అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పశువుల పాక ధ్వంసం


ఈదురు గాలులకు ధ్వంసమైన పశువుల పాక

వెల్దుర్తి(తూప్రాన్‌): మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కానికె యాదగిరికి చెందిన పశువుల పాక పూర్తిగా ధ్వంసమైంది. ఈదురు గాలులతో వర్షం కురవడంతో పాక పైకప్పు సిమెంట్‌ రేకులు ఎగిరిపడటంతో గేదెలకు గాయాలయ్యాయి. ప్రమాదంలో సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

బోల్తా పడిన లారీ


కంది సమీపంలో బోల్తా పడిన లారీ

కంది(సంగారెడ్డి): రోడ్డు పక్కన గుంతలో ఇనుప స్తంభాల లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడింది. ఈ ఘటన మండల కేంద్రమైన కంది శివారులో జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌ నుండి జహీరాబాద్‌ వైపు వెళుతున్న లారీ మంగళవారం తెల్లవారుజామున అదుపు తప్పి రోడ్డు విస్తరణ కోసం తవ్విన గుంతలో పడిపోయింది. డ్రైవర్‌ గాయాలతో బయట పడ్డాడు. అయితే పడిపోయిన లారీ వెనుక నుంచి వచ్చే వారు జాగ్రత్త పడటంతో పెను ప్రమాదం తప్పిందని వాహనదారులు తెలిపారు. ఈ విషయమై తమకు ఫిర్యాదు అందలేదని రూరల్‌ ఎస్సై రవీందర్‌ పేర్కొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌ వైర్‌ చోరీ

అక్కన్నపేట(హుస్నాబాద్‌): విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి కాపర్‌ వైర్‌ను అపహరించారు. ఈ ఘటన మండలంలోని పంతుల్‌తండా గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామ శివారులోని ఓ రైతు వ్యవసాయ క్షేత్రంలో రాత్రి దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్‌ వైర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన రైతులు విద్యుత్‌ శాఖ ఏఈ బద్దం హరీశ్‌రెడ్డి, విద్యుత్‌ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హరితహారం చెట్ల నరికివేత

మద్దూరు(హుస్నాబాద్‌): పర్యావరణాన్ని కాపాడేందుకు నాటిన హరితహారం చెట్లను నరికారు. వివరాలు.. మండలంలోని సలాఖపూర్‌ –మర్మాముల వెళ్లే దారిలో రోడ్డు ప్రక్కన ఉన్న హరితహారం చెట్లను గ్రామానికి చెందిన గూడ నర్సిరెడ్డి, అక్రమంగా గ్రామంలోని కలప వ్యాపారి మల్లారెడ్డి అమ్ముకోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అటవీ బీట్‌ ఆఫీసర్‌ రాముడుకు సమాచారం అందించారు. అలాగే పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. అక్రమంగా హరితహారం చెట్లను నరికి సొమ్ము చేసుకున్న వారిపై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్‌ చేస్తున్నారు.